# ముగింపు దొరికిన కథ

అలవాటుగా స్కూటర్ దారి వెతుక్కుంటూ తీసుకొచ్చిందేమోగానీ... సుదర్శనం ఇంటికొచ్చాడు-

ఇంటిముందు స్కూటర్ ఆపి లోపలికి నడిచాడు గానీ.... అలవాట్లు అన్నీ మరచిపోయినట్లున్నాడు-

లోపలికొస్తున్నాడు-

భార్య ఇంతియాజ్ పున్నమి చందమామంత గుండ్రంగా బొట్టు పెట్టుకుని తలనిండా మల్లెపూండ పెట్టుకుని స్వాగతించింది. కానీ సుదర్శనానికి ఆమెని చూసీ చూడగానే రోజులా 'హాయ్ డార్లింగ్' అని బుగ్గ గిల్లుతూ లోపలికి రావాలని అనిపించలేదు. అనిపించలేదు కాదు... మర్చిపోయాడు.

భార్య విస్తుపోయింది- 'ఈయనకేమయింది' అనుకుని అతని వెనకే లోపలికి వచ్చింది. 'బహుశా మావాళ్లో ఆయన బంధువులో కనిపించి ఉంటారేమో...' అనుకుంటూ-

వస్తూ వస్తూనే సుదర్శనం రాకింగ్ చైర్‌లో కూర్చుని ఇటూ అటూ ఊగులాడుతున్నాడు-

'అమ్మా...

నాన్నా....

పిల్లలా....' అని ఏదో డౌట్‌తో ఊగుతున్నాడు.

'అమ్మయ్య' అనుకుంది ఆవిడ- కథో కవిత్వమో రాసే మూడ్ వస్తే లేదా మూడ్ కోసమో... ఆ ఆలోచన పూర్తయ్యేదాకా ఆయన రాకింగ్ ఛైర్లో ఊగిసలాడటం తను చాలాసార్లు చూసింది.

'ఇందూ... కాఫీ' అని కూడా అడగలేదు సుదర్శనం-

కార్టూన్స్‌లో మగాళ్లూ- కథల్లో ఆడాళ్లూ ఏడుస్తున్నట్లు... బాధలు భరిస్తున్నట్లు రాస్తే... అవి సక్సెసైన ఫార్ములా- కానీ జీవితంలో?? జీవితంలో ఎవరూ???? సుదర్శనానికి సడన్‌గా స్ఫురించింది.

అమ్మానాన్నలు!! అవును- అమ్మానాన్నలే!!

కల్పిత కథలో కన్నీళ్లూ... కార్టూన్లో నవ్వుతెచ్చే కన్నీళ్లూ ఉత్త ట్రాష్!

నిజ జీవితంలో మాత్రం??? ఖచ్చితంగా అమ్మానాన్నలేనా.... అనుకుంటున్నాడు.

✦ ✦ ✦

నిజానికి ఇప్పుడు అతని పేరు సుదర్శనం కాదు- సుభానీ!!

ఇంతియాజ్ పేరు అది కాదు- ఇందిర!!

మతాలు వేరైనా మమతలు కలిపేసిన వేళ... ఆమె పెద్దలు ఆచారం ప్రకారం సుదర్శనాన్ని 'సుభానీ'గా మార్చారు.

పెళ్లి... అదే... నిఖా జరిగింది-

తనకోసం అతను... ఇంట్లోవాళ్లనీ, తన ప్రేమకోసం అతను మతాన్నీ, చివరాఖరికి పేరునీ కూడా వదిలేశాడు- ఇంతియాజ్

పులకించలేదు- చాలా బాధపడింది.

ఆ రాత్రి ఆమెని అతని గదిలోకి పంపించారు. లోపలికి పంపి బైటవాళ్లు తలుపులు మూయగానే ఆమె సరాసరి డ్రస్సింగ్ టేబుల్ దగ్గరికి వెళ్లింది.

అద్దంలో చూసుకుంటూ పున్నమి చందమామలాంటి గుండ్రటి బొట్టు పెట్టుకుని భర్త దగ్గరికి వచ్చింది-

"ఇం...తి...యా...జ్..." ప్రశ్నో ప్రశంసో తెలియని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ అన్నాడు అతను.

"నన్ను ఇంతియాజ్ అని పిలవకండి... నా పేరు ఇవాల్టి నుండి ఇందిర-" ఆమె గొంతులో ఓ స్థిరత్వం- ఓ ప్రతీకారం... ఒక ప్రేమాను రాగం... సుదర్శనానికి ఆమెలో ఓ తిరుగుబాటు... ఓ లొంగుబాటు కూడా కనిపించింది. ప్రశ్నలెయ్యకుండానే సమాధానం పొంది ఆమెని దగ్గరికి తీసుకున్నాడు.

ఆవేల్టి నుంచి ఇంతియాజ్ సుదర్శనాన్ని ఇందిరే!!

ఇందిరకెప్పుడూ అతను సుభానీ కాలేదు!!

+ + +

ఇది జరిగాక... సుదర్శనం కుటుంబమే కాక రెండో కుటుంబ ం కూడా మానసికంగా సాంఘీకంగా ఆ జంటని వెలేసేయ్... ఒకళ్లు కొడుకువల్ల... ఇంకోళ్లు కూతురు వల్ల-

వేడి వేడి కాఫీ తీసుకొచ్చి రాకింగ్ ఛైర్ ఆపింది... ఇందిర. "కాఫీ అండీ కాఫీ! ఇన్‌స్టెంట్ స్ట్రెంగ్త్!! ఇన్‌స్టెంట్ ఇన్‌స్ప్రేషన్!! టింగ్ టింగ్!!!"

అని రేడియో ప్రకటనలా ఉత్సాహబరచబోయింది.

ఉల్లిక్కిపడి అందుకుని గబుక్కున మూడు గుక్కల్లో తాగేశాడు సుదర్శనం.

ఆమెకి డౌట్ పెరిగింది- "మూడ్ బాగా లేదనుకుంటా శ్రీవారికి" అంది.

"అబ్బే ఏం లేదు- బానే వున్నా ఇందిరా!"

"అబద్ధం ఆడద్దు- నేను కాఫీలో పంచదార వెయ్యలేదు- మీరు చెప్పలేదు! అంటే మీరు... ఇక్కడైతే పక్కాలేరు'.

సుదర్శనం ఆమెకేసి చూశాడుగానీ కళ్లలో ఏ భావమూ లేదు.

బ్లాంక్ లుక్...!!

"ఓ... అర్థమైంది"

'యురేకా' అన్నట్లు అరిచింది ఇందిర.

"మీరు ఆఫీసు మేగజైన్‌కి కథ రాయాలన్నారు- ఆ మూడ్‌లో ఉన్నారు- యామై కరెక్ట్?"

అవును అన్నట్లు ఫీలింగ్ లేని నవ్వు నవ్వాడు సుదర్శనం.

"థాట్ వచ్చిందా- పాయింట్ దొరికిందా?"

"కథ అయితే రడీగానే ఉంది- కానీ..."

"నాకు డిక్టేట్ చేయండి!!! ముత్యాల్లాంటి అక్షరాలు పాటలా పరిమళించే అక్షరాలూ నా ప్రత్యేకత... టింగ్ టింగ్..."

ఇందిర చేస్తున్న అల్లరీ... యాక్టివ్ మూడ్... ఏమీ సుదర్శనాన్ని

ఎట్రాక్ట్ చేయట్లేదు-

పెన్నూ కాయితాలు తెచ్చుకుని ఎదురుగా కూచుంది-

"ఏంటి లైన్? లవ్ స్టోరినా? హీరో ఎక్కడ కలుస్తాడు? హీరోయిన్ ఓకే అందా? పెళ్లెక్కడ జరిగింది? ఇద్దరివైపు పెద్దవాళ్లూ... ఒప్పుకు...న్నా.."

అంతవరకూ గడ గడా మాట్లాడ్తున్న ఇందిర గొంతు వణుకుతో వాక్యం పూర్తి చేయలేక పోయింది. అంత ఉత్సాహమూ... నీరుగారి ఆమె కళ్లల్లో పొంగింది.

ఇందిర గొంతులో అపశృతి వినగానే సుదర్శనం మనసు కదిలి వాస్తవానికి వచ్చాడు.

"కథ రడీయే ఇందిరా... కానీ తల్లిదండ్రుల్ని హీరోహీరోయిన్లకి ఎలా కలుపుతామా అని... ఆ ముగింపు తోచట్లేదు..."

"మన కథే రాస్తున్నారా? అయితే కథ పేరు 'ముగింపు లేని కథ' అని పెట్టేద్దాం-!"

"నో... ముగింపు చెప్పకపోతే కథ రాసినవాళ్లు ఫెయిలయినట్లే..."

"భలేవారే.. ఆ బ్రహ్మదేవుడే చాలా కథలకి ముగింపు చెప్పలేక ఫెయిలై... అర్థాంతరంగా ఫుల్‌స్టాపు పెట్టేస్తుంటాడు"

కాజువల్‌గా అన్నమాటని కాజువల్‌గానే పట్టించుకున్నాడు సుదర్శనం- ఆ కథకి 'ముగింపులేని కథ' అని పేరు పెట్టి రాసి, మేగజైన్‌కి ఇచ్చాడు... అచ్చయింది.

✦ ✦ ✦

30 ఏళ్లు గడిచిపోయేదాకా సుదర్శనం-ఇందిర పెద్దవాళ్ల గురించి

ఆలోచిస్తున్నప్పుడు ఈ 'ముగింపులేని కథ' గురించి ఆలోచిస్తునే వున్నారు. వాళ్ల పెద్దవాళ్లు కూడా ఏడో దశకంలోకి వచ్చారు- వయసులు వడలినా మనసు మరలలేదు. 'ఓ రకంగా వాళ్ల పట్టుదలకి జోహార్లే..' అనుకుంటూ ఉండేవాళ్లు-

కొడుక్కీ కూతురికీ వాళ్లిష్టపడ్డ పెళ్లిళ్లు చేశారు.

సుదర్శనం ఇందిరా తాతాబామ్మలు కూడా అయ్యారు. హేపీగా ఉన్నారు.

ఆ తర్వాత కొన్నాళ్లకి...పెళ్లయిన కొత్తల్లో రాసిన కథకి 'ముగింపు లేని కథ'కి ముగింపు చెప్పింది ఇందిర.

ఓరోజు హఠాత్తుగా స్పృహ కోల్పోయింది- సెరిబ్రెల్ హెమరేజ్తో, గాడిద గుడ్డో అని ఇందిర చనిపోయాక డాక్టర్లు ముగింపు చెప్పారు.

అప్పుడు... అప్పుడొచ్చారు... ఇద్దరివైపు వృద్ధులూ-

అందరూ కల్సి భోరుమన్నారు- ఓవర్ యాక్షన్ చేశారు.

'పెద్దవాళ్లు కలిసార్లే...' అనుకున్నాడు సుదర్శనం.

కానీ.... కొందరు 'దహనం' చేయాలన్నారు. కొందరు 'ఖననం' చేయాలి అన్నారు. ఇందిర అనుకున్న ముగింపు దొరికినట్లే దొరికి మాయమైంది.

సుదర్శనానికి అప్పుడు అసలైన ముగింపు తోచింది.

అందర్నీ చూసి 'గెటౌట్' అని అరచాడు. యస్ అదే ముగింపు. ఆ కేకతో వాళ్లు ఇంట్లోంచి, గుండెల్లోంచి వెళ్లిపోయారు.

ఈ ముగింపు చూసి ఇందిర ఫోటో తృప్తిగా నవ్వింది. 